www.jananinadam.com
RNI NO:TGTEL/25/A0870
Follow:

# జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక

**జిల్లా వారిగా విలేకర్లు కావలెను**
ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ . అవినీతి పై సమరాన్ని సాగిస్తున్న జననినాదం తెలుగు దినపత్రికలో చేయుటకు అను భవం ఉన్న ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లా లు,డివిజన్లు, మున్సిపల్ మరియు మండలాల వారిగా విలేకరుల కావలేను.
సంప్రదించాల్సి నెంబర్
9550100197,9490111460

బుధవారం 09-09 - 2026
సంపుటి : 2 సంచిక : 130
ఆసిఫాబాద్ Asifabad
హైదరాబాద్ Hyderabad
ఎడిటర్ : జాధవ్ రోహిదాష్
Editor: JADAV ROHIDAS
పేజీలు : 04
వెల: రూ.2.00
Simultaneously published from , Asifabad, Karimnagar, Adilabad , www.jananinadam.com

## నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ

# భావోద్వేగం...

**వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు**
**స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు**
**వడోదరాను మళ్లీ అపరిశుభ్రం కానివ్వబోమని సంకల్పం తీసుకోవాలన్న మోదీ**
**పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం**
**మోదీ కార్యక్రమానికి బుక్మేషో ద్వారా రిజిస్ట్రేషన్లు.. గంటలోనే సీట్లు ఫుల్**


2వ పేజీలో...

**ఢిల్లీ 08:** గుజరాత్లోని వడోదరా నగరవాసులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. తన పర్యటనకు స్వాగతంగా ప్రజలందరూ ఏకమై నగరాన్ని శుభ్రం చేయడానికి చేపట్టిన 'స్వచ్ఛతతో స్వాగతం' కార్యక్రమాన్ని చూసి తన హృదయం గర్వంతో ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. నేడు మహారాజా సయాజీరావ్ యూనివర్సిటీలో జరిగిన 'సమో 4 వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "నిన్న నేను ఒక వీడియో చూశాను. నా వడోదరాను చూసి నా ఛాతీ గర్వంతో ఉప్పొం గిపోయింది. అద్భుతం!" అంటూ నగర ప్రజల భాగస్వామ్యాన్ని కొనియాడారు. తన పర్యటనకు

## కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది...

# కేటీఆర్ సంచలన ఆరోపణలు

**కాంగ్రెస్ చేపట్టిన ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి కార్యక్రమంపై కేటీఆర్ ధ్వజం**
**కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని విమర్శ**
**ప్రభుత్వంపై డైవర్షన్ రాజకీయాల ఆరోపణ**
**అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్**
**దళిత, గిరిజన హామీలు అమలు చేయాలని డిమాండ్**

**హైదరాబాద్ 08:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్పై కాంగ్రెస్ శ్రేణులు కుట్రపూరితంగా హత్యాయత్నం చేశాయని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి పేరతో కాంగ్రెస్ శ్రేణులు ఆరాచకానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. ఫాంహౌస్ కు వెళుతున్న తమను అరెస్ట్ చేసి బోయినవల్లి పోలీస్ స్టేషన్కు తరలించిన సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ నివాస ప్రాంగణం వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా


2వ పేజీలో...

అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. తమ సొంత ఇంటికి తాము వెళుతుంటే పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారో డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ శ్రేణుల దాడులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నేతలను మాత్రమే పోలీసులు లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు.


2వ పేజీలో...

## బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్--2026

# పోస్టర్ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి

**బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రచారం చేసే ఛాలెంజ్**
**అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్న కోమటిరెడ్డి**
**తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలని ఆకాంక్ష**

**హైదరాబాద్08:** తెలంగాణ విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలకు సజీవ ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడంతో పాటు యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న 'అతురమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ 2005 ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎఫ్ఎసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ చైర్మన్ గిరిధర్

## బీఆర్ఎస్ దాడిలో గాయపడ్డ మహిళా పోలీసులకు

# మంత్రి సీతక్క పరామర్శ



**హైదరాబాద్ 08:** తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల దాడిలో గాయపడ్డ మహిళా పోలీసులను మంత్రి సీతక్క పరామర్శించారు. జరిగిన ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను మంత్రికి మహిళా పోలీసు అధికారులు వివరించారు. కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసభ్యంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను అసభ్యంగా తాకారని.. దానికి సంబంధించిన విజువల్స్ చూపించి.. సీతక్కకు మహిళా పోలీసులు ఫిర్యాదు చేశారు. మా డ్యూటీలు మేము చేస్తుంటే టీ షర్టులు విసిరేసి మీది మీదికి వచ్చారు. విధి నిర్వహణలో మేము చాలా ఇబ్బందులు పడ్డాం' అని మహిళా పోలీసులు వివరించారు. తాము అధికారంలోకి వచ్చాక అంతు చూస్తామని బెదిరించారని ఆవేదన చెందారు. తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఫొటోలు, విజువల్స్ చూసి కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి డ్యూటీలు చేయాల్సిన అవసరం లేదని కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడి వస్తోందని తెలిపారు. ఈ క్రమంలో మహిళా పోలీసులకు మంత్రి ధైర్యం చెప్పారు. ధైర్యంగా ఉండండి మా ప్రభుత్వం అండగా ఉంటుంది. మీ డ్యూటీ మీరు చేయండి. ఎవరి బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు.

## హరీష్ రావు, కేటీఆర్‌ల

# అరెస్ట్...

**కేసిఆర్ నుకలి సేందుకు అసెంబ్లీ నుంచి బయలు దేరిన బీఆర్ఎస్ నేతలు...**





**విజయవాడ, సెప్టెంబర్ 8:** బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై అసెంబ్లీ వద్ద జరిగిన అమానుష ఘటనపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని, అక్కాచెల్లెమ్మలకు జరిగింది చూస్తే గుండె తరుక్కుపోతుందని హరీష్ రావు అన్నారు. అయితే అవమానం జరిగింది నీ తల్లికి కాదు, మా అమ్మకు అని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై జరిగిన దాడిలో పోలీసులపై చర్యలను మంత్రి శ్రీధర్ బాబు పరిశీలిస్తామని అన్నారు. సబితక్క గొంతునొక్కారు, మగ పోలీసులు ఈ పని చేసినట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తుంటే.. దీనిపై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సునీతా లక్ష్మారెడ్డిని చీర లాగి అవమానిస్తే.. ఆ పోలీసులపై చర్యలు తీసుకోవడానికి బదులుగా వీరిపైనే కేసులు నమోదు చేసి వేధించడం ఏంటని ప్రశ్నించారు. బాధితులకు న్యాయం చేయాల్సిందిపోయి, వారిపై కేసులు నమోదు చేసి వేధించడంపై హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇది మంచి పద్ధతి కాదని, ఇది గౌరవసభ కాదని, కౌరవ సభగా మారిందంటూ మండిపడ్డారు. ఆనాడు కౌరవులకు పట్టిన గతే మీకు పడుతుందని, ఈ విషయాలు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గురించి మాట్లాడుతూ.. మీరంటే నాకు చాలా గౌరవం, చాలా ఇష్టం. చాలా ఏళ్ల నుంచి సభలో మీతో కలిసి పనిచేశాం. ఎమ్మెల్సీ తాతా మధు తాను స్పీకర్‌ను ఉద్దేశించి ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. ఒకవేళ మీరు మిమ్మల్ని అన్నారని భావిస్తే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నానంటూ విచారం వ్యక్తం చేశారు. మీ ప్రభుత్వానికి నిజంగానే ఎస్సీ,


## తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారం ఉంది

## కానీ: స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆసక్తికర వ్యాఖ్యలు

**తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారం తనకు ఉందన్న స్పీకర్**
**బీఆర్ఎస్ సస్పెన్షన్ల సంస్కృతి తమది కాదని స్పష్టీకరణ**
**ఈ వ్యవహారంలో కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్**

2వ పేజీలో...

**హైదరాబాద్08:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకునే అధికారం తనకు ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి ఆ దిశగా వెళ్లడం లేదని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. తాతా మధు శాసనసభ సభ్యుడు కాకపోయినప్పటికీ



## స్పీకర్ను బెదిరించే హక్కు హరీశ్‌రావు కు

# ఎవరిచ్చారు..?

**స్పీకర్కు ఆదేశాలు ఇవ్వడానికి మీరెవరని ప్రశ్నించిన శ్రీధర్ బాబు**
**స్పీకర్ ను బెదరించేలా మాట్లాడటం సభా సంప్రదాయాలకు విరుద్ధమని వ్యాఖ్య**
**స్పీకర్ పై దూషణలు వీడియో ఫుటేజీల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయని వెల్లడి**

**హైదరాబాద్08:** అసెంబ్లీ స్పీకర్ స్థానాన్ని ఉద్దేశించి హరీశ్‌రావు బెదిరింపు ధోరణిలో మాట్లా డటం ప్రజాస్వామ్య వ్యవస్థలకే ప్రమా దకరమని రాష్ట్ర శాసనసభవ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీని ఏ రకంగా నడపాలనే దానిపై స్పీకర్కు ఆదే శాలు



2వ పేజీలో...

# నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం...

మొదటిపేజీ తరువాయి...

ముందు నగరం మొత్తం ఒక ప్రజా ఉద్యమంలా మారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వడోదరాలోని ప్రతి కుటుంబంలో స్వచ్ఛతపై సరికొత్త వాతావరణాన్ని సృష్టించిందని పేర్కొన్నారు. ఈ స్వచ్ఛతా స్ఫూర్తిని రాబోయే పండుగలైన గణేశ్ చతుర్థి, నవరాత్రి, దీపావళి వరకు కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "ఈసారి గణపతి వచ్చినప్పుడు, ఆయన ఆశీస్సులన్నీ వడోదరాపైనే కురుస్తాయని నేను భావిస్తున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని కేవలం తాత్కాలికంగా కాకుండా, శాశ్వత పౌర నిబద్ధతగా మార్చుకోవాలని సూచించారు. ఇప్పుడు మనం ఒక సంకల్పం తీసుకుందాం. వడోదరాను మళ్లీ అపరిశుభ్రంగా మారకుండా చూసుకుందాం" అని గుజరాతీలో ప్రజలను కోరారు. ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీఎఫ్సీ), కొత్త రైల్వే సేవలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, నీటి సరఫరా వంటివి ఉన్నాయి. వడోదరా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వ ర్యంలో జరిగిన ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, పౌరులు, అధికా రులు,



ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా 20 లక్షల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా, మోదీ కార్యక్రమానికి 'బుక్మైషో' ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్లు నిర్వహించగా, గంటలోనే అందుబాటులో ఉన్న సీట్లన్నీ నిండిపోవడం, మరో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్టో ఉండటం విశేషం.

# హరీష్ రావు, కేటీఆర్‌ల అరెస్ట్...

మొదటిపేజీ తరువాయి...

ఎస్టీలపై చిత్తశుద్ధి ఉంటే డిక్లరేషన్ ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేయకుండా తాళం ఎందుకు వేశారో ప్రజలకు చెప్పాలని నిలదీశారు. హామీలు నెరవేర్చమంటే కేసులా

తెలంగాణలో ప్రజాస్వామ్యం కూనీ చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిల అరెస్టుపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీలతో పాటు 420 హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా కాంగ్రెస్ పార్టీ సాధించింది ఏమీ లేదని, కేవలం ప్రతిపక్ష నాయకుల అక్రమ అరెస్టులు, నిర్బంధాలకే పరిమితమైందని ఆరోపించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను అమలు చేస్తామంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలమంతా స్వచ్ఛందంగా వచ్చి అరెస్ట్ అవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, అందుకు ప్రభుత్వం సిద్ధమా అని ప్రశ్నించారు. అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం నాడు (సెప్టెంబర్ 7న) మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై పోలీసులు దుర్భాషలాడుతూ అమానుషంగా ప్రవర్తించారని ఆరోపించారు. ప్రభుత్వం నిజంగా మహిళలను గౌరవిస్తే, బాధ్యులైన అధికారులపై ఏం చర్యలు తీసుకున్నారో సమాధానం చెప్పాలని ఈ సందర్భంగా కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం వైఫల్యాలను ప్రశ్నిస్తారన్న కారణంగానే ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు అసెంబ్లీకి రాకుండా అడ్డుకోవడంతో పాటు మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నం జరిగిందన్నారు. అసెంబ్లీ ఘటనలపై హైకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చినా, ఉద్దేశపూర్వకంగా ఫేక్ కేసులు ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. కుట్రలో భాగంగానే బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలను అరెస్ట్ చేశారని.. ఈ చర్యలతో కాంగ్రెస్ ప్రభుత్వానికి కోర్టులు, చట్టాలపై ఉన్న గౌరవం ఏంటో అర్థమవుతోందన్నారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని, ప్రజలు అంతా గమనిస్తున్నారని ఇకనైనా మేలుకోవాలని హెచ్చరించారు. కేసీఆర్ ను ఎలా కాపాడుకోవాలో తెలుసుతాము బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తున్న క్రమశిక్షణ కలిగిన సైనికులమని... కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత చర్యలకు, పోలీసుల అక్రమ అరెస్టులకు తాము ఏమాత్రం భయపడేది లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ దారుణాలను, వైఫల్యాలను ప్రజల కళ్లకు కట్టినట్లు ఎండగడుతుంటే తట్టుకోలేకనే ప్రతిపక్షంపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ నడుస్తుండగా ప్రభుత్వ విప్‌లు, అధికార పార్టీ ఎమ్మెల్యేలను డప్పులు కొట్టుకుంటూ కేసీఆర్ ఫాంహౌస్ వైపు పంపడం ఏ రకమైన సంస్కారమని జగదీశ్ రెడ్డి నిలదీశారు. 'కేసీఆర్‌ను అంతమొందించేందుకే వెళుతున్నాం' అని ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే బహిరంగంగానే తీవ్ర వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఆయనపై పోలీసులు వెంటనే సుమోటోగా కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌పైకి కావాలనే నిరసనకారులను పంపుతున్నారని, పోలీసులు వారిని ఆపకపోతే బీఆర్ఎస్ శ్రేణులే రంగంలోకి దిగి తగిన రీతిలో బుద్ధి చెబుతాయని జగదీశ్ రెడ్డి హెచ్చరించారు. కేసీఆర్‌ను కాపాడుకోవడం తమకు, తెలంగాణ సమాజానికి పెద్ద కష్టమేమీ కాదని తేల్చిచెప్పారు. శాసనసభకు వస్తున్న ప్రజాప్రతినిధులను అడ్డుకోవడంపై తాము హైకోర్టును ఆశ్రయించగా... ప్రతిపక్ష ఎమ్మెల్యేలను అసెంబ్లీకి రాకుండా ఎవరు, ఎందుకు అడ్డుకున్నారనే వివరాలను రెండు వారాల్లో సమర్పించాలని అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆ భయంతోనే రాత్రికి రాత్రే బీఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు నమోదు చేశారని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, ప్రజలకు తాగడానికి, సాగుకు నీళ్లు ఇవ్వలేక, పేదల భూములను గుంజుకుని అమ్ముకుంటూ కాంగ్రెస్ నేతలు సొంత జేబులు నింపుకుంటున్నారని దుయ్యబట్టారు.

## బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్--2026
## పోస్టర్ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి

మొదటిపేజీ తరువాయి...

రెడ్డిలతో కలిసి సచివాలయంలో ఈ ఛాలెంజ్ అధికారిక పోస్టర్ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... షార్ట్ ఫిలింలు, బతుకమ్మ పాటలు, సృజనాత్మక వీడియోల ద్వారా తమ ప్రతిభను చాటుకోవాలనుకునే యువ ఫిలిం మేకర్లకు ఈ ఛాలెంజ్ ఒక అద్భుత వేదికగా ఉపయోగపడుతుందన్నారు. బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభి వృద్ధి కార్యక్రమాలను కూడా ప్రతిబింబించేలా షార్ట్ ఫిలింలను రూపొందించవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో యువ దర్శకులు, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలని ఆకాంక్షించారు.

## కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది...
## కేటీఆర్ సంచలన ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి...

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. ప్రజల దృష్టిని ప్రభుత్వ వైఫల్యాల నుంచి మళ్లించేందుకే డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారని అన్నారు. "డైవర్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్ తప్ప రేవంత్రెడ్డికి మరో విద్య తెలియదు" అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాల సమయాన్ని ప్రజా సమస్యలపై ఉపయోగించాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను విమర్శించేందుకు సభను ఉపయోగించుకోవడం సరికాదన్నారు. ఇందుకోసం ఒక రోజు కేటాయించి.. మిగిలిన రోజుల్లో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు.

## తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారం ఉంది
## కానీ: స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆసక్తికర వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి...

(ఎమ్మెల్సీ), సభాధిపతిగా ఆయనపై చర్య తీసుకునే అధికారం తనకు ఉందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "బీఆర్ఎస్ హయాంలో మాదిరిగా ఎవరినీ అకస్మాత్తుగా సస్పెండ్ చేయబోమని, ఈ వ్యవహారాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలోనే పరిష్కరిస్తాం" అని ప్రసాద్ కుమార్ వెల్లడించారు. ఈ వివాదంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా క్షమాపణ చెప్పాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తోందని ఆయన తెలిపారు. ప్రతి అసెంబ్లీ సమావేశానికి ముందు సభకు హాజరుకావాలని తాను వ్యక్తిగతంగా కేసీఆర్ను కోరుతూనే ఉన్నానని ఆయన గుర్తుచేశారు. అసెంబ్లీలో మహిళా సభ్యుల పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించారన్న ఆరోపణలపైనా స్పీకర్ స్పందించారు. విచారణలో పోలీసుల తప్పిదం ఉన్నట్లు తేలితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, నేటి సభా కార్యక్రమాలకు తాను అధ్యక్షత వహించడం లేదని, ప్యానెల్ స్పీకర్ కడియం శ్రీహరి సభను నిర్వహిస్తారని గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

## స్పీకర్ను బెదిరించే హక్కు హరీశ్‌రావు కు ఎవరిచ్చారు..?

మొదటిపేజీ తరువాయి...

ఇవ్వడానికి, "ఇలా చేయొద్దు.. అలా చేయొద్దు" అని శాసించడానికి ప్రతిపక్ష నేతలెవరని సూటిగా నిలదీశారు. రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉన్న స్పీకర్ను బెదిరించేలా వ్యవహరించడం సభా సంప్రదాయాలకే విరుద్ధమని స్పష్టం చేశారు. స్పీకర్పై జరిగిన దూషణల వ్యవహారంలో సదరు నేతలు ఏం మాట్లాడారో వీడియో ఫుటేజీల్లో అత్యంత స్పష్టంగా రికార్డై కనిపిస్తోందని తేల్చిచెప్పారు. మహిళా ప్రజాప్రతినిధులపై జరిగిన సంఘటనలను ప్రభుత్వం, స్పీకర్ పక్కన పెట్టేస్తున్నారన్న బీఆర్ఎస్ విమర్శలను శ్రీధర్ బాబు పూర్తిగా కొట్టిపారేశారు. మహిళా ఎమ్మెల్యేల అంశంపై సమగ్ర నివేదిక సమర్పించాలని శాసనసభాపతి స్వయంగా ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. అయితే మహిళా ఎమ్మెల్యేల అంశాన్ని చూపిస్తూ, అదే సమయంలో స్పీకర్ను నేరుగా అవమానించిన అత్యంత తీవ్రమైన పరిణామాన్ని అసలు పట్టించుకోవద్దని ప్రతిపక్ష నేతలు మాట్లాడటం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని ధ్వజమెత్తారు. అత్యున్నతమైన స్పీకర్ వ్యవస్థపై దాడి జరిగిన వ్యవహారాన్ని పక్కన పెట్టాలని కోరడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించిన ఆయన, చట్టసభనిబంధనలకు కట్టుబడి బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఈవీఎం గోదాం తనిఖీ చేసిన కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ సెప్టెంబర్ 08:** జిల్లాకేంద్రంలో కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోదామును మంగళవారం కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి (రెవెన్యూ).. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఈవీఎం, వీవీ ప్యాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాం వద్ద సీసీ కెమెరాల పనితీరు, సిబ్బంది హాజరు, ఫైర్ సేఫ్టీ తదితర వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం, వీవీ ప్యాట్ల గోదాం తనిఖీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని కలెక్టర్.. సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు మడుపు మోహన్ (కాంగ్రెస్), నాంపల్లి శ్రీనివాస్ (బీజేపీ), సయ్యద్ ఇబ్రహీం



(ఏఐఎంఐఎం), సిరిసిల్ల అంజయ్య (బీఎస్పీ) తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలకు కేసీఆర్ ఇచ్చిన ట్రైనింగ్ ఇదేనా? : కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**కరీంనగర్ సెప్టెంబర్ 08:** ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ వద్ద ప్రవర్తించిన తీరు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి విమర్శించారు. కోర్టు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాల వేసి మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, అసెంబ్లీ సమావేశాలకు ముందు కేసీఆర్ బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులకు గూండాయిజం చేయాలని, కుసంస్కారంగా మాట్లాడాలని శిక్షణ ఇచ్చారా అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడాల్సిన ఎమ్మెల్యేలు పోలీసులతో ఘర్షణలకు దిగడం సరికాదన్నారు. దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి, అనంతరం ధర్నాలు, రాస్తారోకోలు చేయడం విడ్డూరమని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు తమ ప్రవర్తనకు రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని, స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆనందంగా గణేష్ ఉత్సవాలు... అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సమన్వయంతో నిర్వహిద్దాం, అందరికీ ఆదర్శంగా నిలుద్దాం

### వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**జననినాదం,గోదావరిఖని08:** గణేష్ చతుర్థి పర్వదినం సందర్భంగా ఈ నెల 14న ప్రారంభమయ్యే గణేష్ ఉత్సవాలు, 25న నిర్వహించే గణేష్ విగ్రహాల నిమజ్జనంతో ముగియనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. మంగళవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లకు చెందిన హిందూ మత పెద్దలు, గణేష్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధ్యక్షతన కాన్ఫరెన్స్ హాల్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ: ప్రతి పండుగను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 14న గణేష్ చతుర్థి, 25న గణేష్ విగ్రహాల నిమజ్జనం ఉంటుందని, విగ్రహాల ఏర్పాటు నుంచి మండపాల నిర్వహణ, విగ్రహాల రవాణా, భక్తుల రద్దీ నియంత్రణ, శోభాయాత్ర, నిమజ్జనం వరకు ప్రతి దశలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తెలంగాణ పోలీస్ శాఖ గణేష్ మండపాల వివరాలను సేకరించి, వాటిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. కమిషనరేట్ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసే మండపాలు, విగ్రహం ఎత్తు, వాహనాల ఎత్తు, నిర్వాహకుల వివరాలు, శోభాయాత్ర రూట్, నిమజ్జనానికి ఉపయోగించే వాహనాలు తదితర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు.

వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు పూర్తి వివరాలతో సంబంధిత పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సీపీ సూచించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా ప్రతి మండపాన్ని జియోట్యాగింగ్ చేసి 'టీజీ-కాప్' పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తామని తెలిపారు. జియోట్యాగింగ్ ద్వారా సంబంధిత ఎస్‌హెచ్‌ఓలు మండపాల వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు వీలుంటుందన్నారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా శోభాయాత్ర సాఫీగా సాగేలా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి, ఏర్పాట్లను పర్యవేక్షిస్తామని తెలిపారు. మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాల్సిన సూచనలు: – గణేష్ మండపాల వద్ద జరిగే కార్యక్రమాలకు బాధ్యత వహిస్తూ ప్రతి మండప కమిటీ అధ్యక్షుడు ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతారు. గణేష్ మండపాలను ప్రజల వాహనాల రాకపోకలకు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి విగ్రహం వద్ద 24 గంటలు ఇద్దరు వ్యక్తులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి. పాయింట్ బుక్ ఏర్పాటు చేసి, బ్లూ కోట్స్, పెట్రోల్ కార్ సిబ్బంది ద్వారా మండపాలను నిరంతరం తనిఖీ చేస్తారు. మండపాల పేరుతో ఎలాంటి లక్కీ డ్రాలు నిర్వహించకూడదు. అలాగే జూదం నిర్వహించరాదు. ఎవరినీ బలవంతంగా చందాలు అడగకూడదు. గణేష్ మండపాల వద్దకు ఎవరూ మద్యం సేవించి రాకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలి. ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదు. విద్యుత్ శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. అనుమతి లేకుండా మండపాలకు విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయకూడదు. విద్యుత్ కనెక్షన్లు, లైట్ల ఏర్పాటులో నాణ్యమైన వైర్లు, పరికరాలను మాత్రమే వినియోగించాలి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలి. అవసరమైన ప్రదేశాల్లో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఫైర్ బాల్స్, నీటి బకెట్లు అందుబాటులో ఉంచాలి. విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రాంతాలు, పరిసర ప్రాంతాలు, నిమజ్జనానికి వెళ్లే మార్గాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందుగానే తగిన చర్యలు తీసుకోవాలి. డీజేలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించకూడదు. ఇతర మతాలను కించపరిచే విధంగా ప్రసంగాలు చేయడం, పాటలు పాడడం లేదా ప్రసారం చేయడం వంటి వాటికి పూర్తిగా దూరంగా ఉండాలి. ఉత్సవాలను సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలి. సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు, పుకార్లు లేదా ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా పోస్టులు చేసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని చూసి సంయమనం పాటించాలని, సమాచారం నిజమా, అబద్ధమా అనే విషయాన్ని స్థానిక పోలీసులను సంప్రదించి నిర్ధారించుకోవాలని సూచించారు.

– ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే డయల్-112కు లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలి. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తూ మత ఘర్షణలకు, శాంతిభద్రతల సమస్యలకు కారణమయ్యే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అన్ని మతాలకు సంబంధించిన సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నిరంతరం నిఘా ఉంచాలని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలను సంతోషకర వాతావరణంలో నిర్వహించుకునేలా పటిష్ఠమైన పోలీస్ బందోబస్తు



ఏర్పాటు చేయాలని సీపీ అధికారులను ఆదేశించారు.

గణేష్ విగ్రహాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు సూచించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని, శోభాయాత్ర సమయంలో పోలీస్ శాఖ రూపొందించిన రూట్ మ్యాప్‌ను తప్పనిసరిగా అనుసరించాలని, పోలీసులకు శాంతి కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని సీపీ కోరారు. పండుగలో ఆనందం వెల్లివిరియాలి... విషాదానికి తావుండకూడదు. అందరం సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించుకుందామని సీపీ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఏసీపీలు ఏ. వెంకటేశ్వర్లు, టీ.ప్రవీణ్ కుమార్, రామగుండం సీఐ కృష్ణ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ భీమేష్, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్‌ఐలు భూమేష్, చంద్రశేఖర్, సంధ్యారాణి, మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జననినాదం
బుధవారం 09 సెప్టెంబరు 2026

# ధాన్యం కొనుగోళ్లకు ముందస్తుగా ఏర్పాట్లు పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 08:** జిల్లాలో వానాకాలం 2026-27 సీజన్‌కు సంబంధించి వరి ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు చర్యలు తీసుకొని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా మార్కెటింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం 2026-27లో జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన గోదాములను ముందుగానే గుర్తించి సిద్ధంగా ఉంచాలని, ధాన్యం కొనుగోళ్ల కొరకు సంబంధిత ఏజెన్సీలతో ముందస్తు సమావేశాలు నిర్వహించి, సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎట్టి పరిస్థితులలోనూ లోతట్టు ప్రాంతాలలో ఏర్పాటు చేయరాదని, ఎత్తైన ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చదునుగా ఉన్న అనుకూల ప్రదేశాలను ఎంపిక చేసి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా రైతులకు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలకు తరచుగా అడిగే ప్రశ్నలుపై అవగాహన కల్పించాలని సూచించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలు, కొనుగోలు విధానం తదితర అంశాలపై రైతులకు ముందస్తుగా అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర అవసరమైన సదుపాయాలను ముందుగానే సమకూర్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వానాకాలం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ అభ్యర్థులకు స్వయం ఉపాధికి చేయూత..

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**జననినాదం,కెరమెరి,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 08:** షెడ్యూల్డ్ కులాలకు చెందిన అర్హులైన అభ్యర్థులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ కె.హరిత తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం లో 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎస్సీ అభ్యర్థుల స్వయం ఉపాధి పథకం ఆర్థిక పురోగతిపై నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2025--26 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ అభ్యర్థుల స్వయం ఉపాధి పథకం కింద మంజూరైన యూనిట్లు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్వయం ఉపాధి ద్వారా వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహిస్తామన్నారు. సమావేశంలో షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ కార్యనిర్వహణ సంచాలకులు సురేష్‌కుమార్, ఎస్సీ అభివృద్ధి అధికారి ఎం.అశోక్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జనార్ధన్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మసూద్ అలీతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ముట్టడికి పిలుపు.. ఉపసర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

**జననినాదం,సిర్పూర్(యు) 08:** ఉపసర్పంచ్‌ల చెక్ పవర్ రద్దును నిరసిస్తూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునివ్వడంతో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు చెందిన పలువురు ఉపసర్పంచ్‌లను హౌస్ అరెస్టు చేశారు. ఉపసర్పంచ్‌ల మండల అధ్యక్షుడు పెందోర్ రామారావు, ఉపసర్పంచ్‌లు ఆత్రం గణపత్ రావు, రాము తదితరులను వారి ఇళ్ల వద్దే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు అరెస్టులు చేపట్టినట్లు ఏఎస్సై గంగారం తెలిపారు. అయితే తమ చెక్ పవర్ రద్దును నిరసిస్తూ శాంతియుతంగా ఆందోళన చేపట్టేందుకు సిద్ధమవుతుండగా ముందస్తు అరెస్టులు చేయడంపై ఉపసర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు.



# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే 75 రకాల వైద్య పరీక్షలు..

**22 మల్టీ పారామెట్రిక్ డయాగ్నస్టిక్ సిస్టమ్స్ ఏర్పాటు ... కలెక్టర్ కె.హరిత**




**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 08:** గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 75 రకాల వైద్య పరీక్షలు నిర్వహించేలా 22 మల్టీ పారామెట్రిక్ డయాగ్నస్టిక్ సిస్టమ్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కలెక్టర్ కె.హరిత తెలిపారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్), ఏవియానిక్స్ డివిజన్ హైదరాబాద్, ఓమిని యాక్టివ్ ఫౌండేషన్ సహకారంతో సీఎస్‌ఆర్ కార్యక్రమం కింద ఈ పరికరాలను సమకూర్చారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ తో పాటు మంగళవారం అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మాట్, ఓమిని యాక్టివ్ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ బాటియాతో కలిసి మల్టీ పారామెట్రిక్ డయాగ్నస్టిక్ సిస్టమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధునాతన వైద్య పరికరాలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే రోగుల వైటల్స్ పర్యవేక్షణ, రక్త పరీక్షలు, వివిధ ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఈ పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సహకరిస్తున్న హెచ్‌ఏఎల్ సంస్థకు జిల్లా యంత్రాంగం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఆధునిక వైద్య సాంకేతికతను ప్రాథమిక స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. జిల్లాలో ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్ర, ఆకాంక్షిత జిల్లా సమన్వయకర్త బాలరాజు, వైద్యాధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లు, నర్సులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

**వినాయక నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు...**వినాయక మండపాలు, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు, ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్లు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య, అగ్నిమాపక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, సోషల్ మీడియాలో వచ్చే ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. సమావేశంలో ఎస్పీ నితిక పంత్, అదనపు కలెక్టర్లు యువరాజ్ మార్మట్, ఎం. డేవిడ్, సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తిర్యాణిలో జిన్నింగ్ మిల్ ఏర్పాటు చేయాలి

**మార్కెట్ కమిటీ డైరెక్టర్ నైతం రాంచందర్**



**జననినాదం,తిర్యాణి 08:** మారుమూల ప్రాంతాల రైతుల ప్రయోజనం కోసం తిర్యాణి మండలంలో ప్రభుత్వం జిన్నింగ్ మిల్ ఏర్పాటు చేయాలని ఆసిఫాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) డైరెక్టర్ నైతం రాంచందర్ కోరారు. మంగళవారం ఆసిఫాబాద్‌లో నిర్వహించిన ఏఎంసీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో చేపట్టాల్సిన మరమ్మతు పనులకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారులకు అందజేశారు. మండలంలో జిన్నింగ్ మిల్ అందుబాటులోకి వస్తే రైతులకు రవాణా భారం తగ్గడంతో పాటు పత్తి ఉత్పత్తుల విక్రయాల్లో ప్రయోజనం కలుగుతుందని రాంచందర్ తెలిపారు. ప్రభుత్వం తరఫున మిల్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించి, త్వరలో మార్కెట్ యార్డు మరమ్మతు పనులు చేపడతామని తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ హేమలత, పీఎస్‌సీహెచ్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధి లక్ష్యంగా అటవీశాఖ పనిచేస్తోంది

**డివిజనల్ ఫారెస్ట్ అధికారి అప్పయ్య**

**గ్రామస్థులతో గ్రామసభ... జలపాతం సందర్శన పునః ప్రారంభం**



**జననినాదం,తిర్యాణి 08:** గ్రామాభివృద్ధి లక్ష్యంగా అటవీశాఖ పనిచేస్తోందని ఆసిఫాబాద్ డివిజనల్ ఫారెస్ట్ అధికారి అప్పయ్య తెలిపారు. మంగళవారం చింతలమాదర గ్రామస్థులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలపాతం నిర్వహణతో స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు గ్రామం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. గ్రామస్థుల సహకారంతో జలపాతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అటవీశాఖకు సంబంధించి గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. బుధవారం నుంచి గ్రామస్థులు, అటవీశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో పర్యాటకుల సందర్శనకు అనుమతులు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్, గిన్నేధరి ఇన్‌చార్జి అటవీశాఖ అధికారిణి సరోజరాణి, గ్రామస్థులు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# తాత మధును బర్తరఫ్ చేయాలి...

**దళిత ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను సహించం**



ఆసిఫాబాద్‌జిల్లాలో



కెరమెరి లో..

**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 08:** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం కెరమెరి బస్టాండ్ ప్రాంతంలో ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు తాత మధు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మొహమ్మద్ సుజాయిత్‌ఖాన్, ఇందిరా ఫెలోషిప్ జిల్లా అధ్యక్షురాలు కోవ ఇందిరా మాట్లాడుతూ.. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా, మహిళల గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం సమర్థనీయం కాదన్నారు. దళిత సమాజం నుంచి ఎదిగి అత్యున్నత రాజ్యాంగ పదవుల్లో ఒకటైన శాసనసభ స్పీకర్ పదవిని చేపట్టిన గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అవమానకర వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. తాత మధు వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనపై పార్టీ పరంగా కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు తక్షణమే బర్తరఫ్ చేయాలని కోరారు. దళితులను అవమానించింది బీ ఆర్ ఎస్ పార్టీ అన్న సంగతి గుర్తుంచుకోవాలని హితవుపలికారు. దళితులను ముఖ్యమంత్రి చేస్తానని మోసం చేసిన బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు స్పీకర్ పై అనుచిత వాక్యాలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు.

ఈ వ్యవహారంపై బీఆర్‌ఎస్ అధినేత, పార్టీ నాయకత్వం వెంటనే స్పందించాలని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉపసర్పంచ్ వాగ్మారె శ్రీకాంత్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహర్లే బాపురావు, ఆత్మ కమిటీ సభ్యులు గోగర్ల రాజయ్య, జాదవ్ ప్రకాశ్, మాజీ సర్పంచ్ జగన్నాథ్‌రావు, కాంగ్రెస్ నాయకులు రాథోడ్ సుదర్శన్, ఆత్రం తిరుపతి, గిడ్డప్ప, గుండి బాపురావు, మడావి రాజు, అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. **ఆసిఫాబాద్ లో...**తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై తాత మధు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం ఆసిఫాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తాత మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని, మహిళల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను సహించేది లేదన్నారు. తాత మధు తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనపై బీఆర్‌ఎస్ పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుని బర్తరఫ్ చేయాలని కోరారు. ఈ వ్యవహారంపై బీఆర్‌ఎస్ అధినేత, పార్టీ నాయకత్వం స్పందించాలని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ, వైస్ చైర్మన్ గాజుల రవి, డైరెక్టర్లు హేమలత, జక్కన్న, విశ్వనాథ్, మారుతి పటేల్, 1వ వార్డు కౌన్సిలర్ జాడి వినోద్, డీసీసీ ఉపాధ్యక్షులు ఉబైద్ బిన్ యహియా (తారీక్), భీమ్రావు, మండల అధ్యక్షుడు రాపర్తి మురళి, ప్రధాన కార్యదర్శి బాలు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కాశీఫ్ హష్మీ, ఉపాధ్యక్షులు దుర్గం రమేష్, హౌస్, షకీల్, అతిక్, భాను, ఇగురపు సంతోష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్లపై పోలీసుల పంజా... ఏడుగురి అరెస్ట్

**ఘటనా స్థలంలో రూ.1,330 నగదు స్వాధీనం**

**జననినాదం, రెబ్బెన,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 08:** రెబ్బెనలోని ఎన్‌టీఆర్ నగర్ కాలనీ పరిసర ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు మంగళవారం తెల్లవారుజామున సుమారు 3 గంటలకు పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పోలీసుల రాకతో పేకాటరాయుళ్లు ఉలిక్కిపడ్డారు. సంఘటనా స్థలంలో పేకాట ఆడుతున్న బొంగని నాగభూషణం, అజ్మీరా లాల్‌సింగ్, అజ్మీరా విజయ్, అవదాపు గోపి, పరువెల్లి నర్సింగరావు, జైస్వాల్ మనీష్, ఈస్లావత్ ప్రకాష్‌లను పోలీసులు పట్టుకున్నారు. వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు సమాచారం. పేకాట స్థలం నుంచి రూ.1,330 నగదును స్వాధీనం చేసుకున్నారు. జూదం, పేకాట, బెట్టింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**జననినాదం,సిర్పూర్ (యు) 08:** మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ హాస్టల్‌లో ఖాళీగా ఉన్న ఒక అసిస్టెంట్ కుక్ పోస్టును భర్తీ చేయనున్నట్లు మండల విద్యాధికారి కుడిమేత సుధాకర్ తెలిపారు. ఏడో తరగతి ఉత్తీర్ణులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# తాత మధు వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధం

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొట్నాక గణపతి**





**జననినాదం,తిర్యాణి 08:** రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని కాంగ్రెస్ పార్టీ తిర్యాణి మండల అధ్యక్షుడు కొట్నాక గణపతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడటం సరికాదన్నారు. తాత మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దళిత, గిరిజన, బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ సహించబోదని స్పష్టం చేశారు. రాజ్యాంగ పదవులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దె విజయ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్యాల అశోక్, నాయకులు జుగనక మారుతి, కొవ శంకర్, పూసం రాజు తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆత్రం శంకర్‌రావు**

**జననినాదం,సిర్పూర్(యు) 08:** శాసనసభ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిర్పూర్(యు) కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆత్రం శంకర్‌రావు తెలిపారు. స్పీకర్ పీఠాన్ని అవమానించేలా దురుసుగా మాట్లాడటం ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యవస్థలను అవమానించడమేనని అన్నారు. తాత మధు తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. నైతిక బాధ్యత వహిస్తూ తాత మధు వెంటనే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి రోడ్డుపై నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యవర్గ సభ్యుడు సుద్దాల శ్రీనివాస్, పాములవాడ సర్పంచ్ అంభరావు, రాఘూపూర్ సర్పంచ్ లక్ష్మీ భీర్ష, సిర్పూర్(యు) ఉపసర్పంచ్ రామారావు, పాములవాడ ఉపసర్పంచ్ హనుమంత్, మహాగావ్ ఉపసర్పంచ్ భీమ్రావు, ఏఎంసీ డైరెక్టర్ లచ్చన్న, మాజీ ఎంపీపీ దౌలతరావు, మైనారిటీ అధ్యక్షుడు షైక్ ఆరిఫ్, జిల్లా యూత్ సభ్యుడు సుద్దాల ఆనంద్, సీనియర్ నాయకులు దేవీదాస్, శ్రీనివాస్, కృష్ణ, నాగోరావు, జగ్గారావు, భీమ్రావు, బీఎల్ఏలు దినేష్, జలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# బియ్యాన్ని త్వరగా అందించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 08:** రైస్ మిల్లర్లు తమకు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా బియ్యాన్ని త్వరగా అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని భీమారం మండలం అంకుశాపూర్ గ్రామంలో గల సమతా రైస్ మిల్ ను ఆకస్మికంగా సందర్శించి రైస్ మిల్లు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి సేకరించిన ధాన్యాన్ని సామర్థ్యానికి అనుగుణంగా రైస్ మిల్లులకు కేటాయించడం జరిగిందని, రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని మద్దికల్ గ్రామాన్ని సందర్శించి పారిశుద్ధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. ప్రతి రోజు తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని, మురుగు కాలువలలో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని తెలిపారు. నీటి నిల్వలు లేకుండా శుభ్రపరచాలని, పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు పొందిన లబ్ధిదారులు నిబంధనల ప్రకారం 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం చేపట్టి త్వరగా పూర్తి చేయాలని, నిర్దేశిత విస్తీర్ణంలో నిర్మించిన ఇండ్లకు మాత్రమే బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇండ్లు పొందిన లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టి త్వరగా పూర్తి చేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామంలో కొంతమంది రైతులు వరి సాగు చేయడాన్ని గమనించి వారితో మాట్లాడారు. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. పంట సాగుకు బోర్లు, చెరువు అందుబాటులో





ఉండడంతో వరి సాగు చేస్తున్నామని తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో భాగంగా చేపట్టిన రీ సర్వే ప్రక్రియలో నిర్దేశిత విధానాలను పాటించాలని, ఫీల్డ్ రిజిస్టర్, విలేజ్ రిజిస్టర్ లలో వివరాలు నమోదు చేస్తూ సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. రీ సర్వే పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆరేపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో నోటీసుల జారీ, విచారణ కార్యక్రమాల నిర్వహణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం తయారీలో శుభ్రత నిబంధనలు పాటించాలని సిబ్బందికి సూచించారు. 6వ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించి స్వయంగా వారికి పాఠ్యాంశాలు బోధించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు పట్టిక, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. నూతనంగా నిర్మించిన భవిత కేంద్రాన్ని సందర్శించి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో మండల తహసిల్దార్ సదానందం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కార్యాలయంలో పూలే దంపతుల చిత్రపటాలు ఏర్పాటు చేయాలి

**బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి,జన నరెడ్ల శ్రీనివాస్**
**మేయర్, డిప్యూటీ మేయర్‌కు పూలే దంపతుల చిత్రపటాలు అందజేత**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 08:** మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల ఆశయాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ప్రభుత్వ కార్యాలయం, విద్యాసంస్థలో వారి చిత్రపటాలను ఏర్పాటు చేయాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ కోరారు. మంగళవారం మంచిర్యాల మేయర్ ధరణి మధు, డిప్యూటీ మేయర్ చల్ల రమ్యలను కలిసి పూలే దంపతుల చిత్రపటాలను అందజేశారు. వాటిని అధికారిక కార్యాలయాల్లో గౌరవప్రదంగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పూలే దంపతుల ఆశయాలను చిత్రపటాలకే పరిమితం చేయకుండా ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. విద్యాభివృద్ధి, మహిళా సాధికారత, సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బీసీ ప్రజాప్రతినిధులు తమ అధికారిక, వ్యక్తిగత కార్యాలయాల్లో పూలే దంపతుల చిత్రపటాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థల్లోనూ చిత్రపటాలను ఏర్పాటు చేసి పూలే దంపతుల జీవిత చరిత్ర, మహిళా విద్య కోసం వారు చేసిన కృషి, సామాజిక సమానత్వం కోసం సాగించిన పోరాటాన్ని విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పూలే దంపతుల చిత్రపటాలను ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ జిల్లా కార్యదర్శి బియ్యాల సత్తయ్య, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుతోట పద్మాదేవి, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఇనవంక నాగలక్ష్మి, గాండ్ల తిలకేశ్వర రాష్ట్ర నాయకుడు జక్కం రవీందర్, నాయి బ్రాహ్మణ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల చంద్రయ్య, మైనార్టీ నాయకుడు ఎండీ హుస్సేన్, బీసీ సమాజ్ జిల్లా నాయకులు గొల్ల సత్యనారాయణ, పొదిశెట్టి వినోద్, పట్టణ నాయకులు చల్ల విజయ్‌కుమార్, తాటిపాముల సమ్మయ్య, పల్లపు శ్రీనివాస్, ముదిపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయాలని అంబేద్కర్‌కు వినతి



**జననినాదం,సిర్పూర్(యు) 08:** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం సిర్పూర్(యు) మండల కేంద్రంలో వినూత్న నిరసన చేపట్టారు. పార్టీ మండల అధ్యక్షుడు తొడసం ధర్మారావు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ హామీల అమలులో జాప్యంపై నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, పార్టీ ఉపాధ్యక్షుడు ఆర్క నాగోరావు, సర్పంచులు ఆత్రం ఓం ప్రకాశ్, కొమురం భీంరావు, పార్టీ కార్యదర్శి మెస్రం నరేశ్, యువజన అధ్యక్షుడు కోవ నాందేవ్, మండల నాయకులు గేడం యశ్వంత్, గోడెం అమృత్‌రావు, నాగోరావు, బలవంత్, అధిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఐపీఎస్ పుల్లా కర్ణాకర్ కు సన్మానం

**హుజురాబాద్ సెప్టెంబర్ 08:** కమలాపూర్ మండల పరిధిలోని ఉప్పల్ గ్రామంలో ఇటీవల ఐపీఎస్ గా పదోన్నతి పొందిన పుల్లా కర్ణాకర్ గారి అభినందన సభలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపిన హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ గారు..భవిష్యత్ లో వారు మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని గారు,వైస్ చైర్ పర్సన్ అంజలి గారు,ఉప్పల్ గ్రామ సర్పంచ్ రమ-నాగరాజు గారు,కౌన్సిలర్లు,మార్కెట్ చైర్మన్లు,డైరెక్టర్లు,అన్ని మండలాల అధ్యక్షులు,వివిధ గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..




# వెదురు సాగుతో రైతులకు అధిక లాభం...


**అదనపు కలెక్టర్ విజయలక్ష్మి.**





**జయశంకర్ భూపాలపల్లి,సెప్టెంబర్ 08:** వెదురు సాగుతో రైతులు, మహిళా సంఘాలు అధిక లాభాలను ఆర్జించడంతో పాటు స్థిరమైన జీవనోపాధిని పొందవచ్చని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం పలిమెల మండలంలోని దమ్మూరు, బూరుగూడెం ప్రాంతాల్లో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా దమ్మూరు గ్రామంలో జరుగుతున్న ఫామ్ పాండ్ పనులను పరిశీలించి, పనుల నిర్వహణ, కూలీల హాజరు తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఫామ్ పాండ్ పనుల వద్ద రోల్‌కాల్‌ను తప్పనిసరిగా పాటించాలని, కూలీలకు మెరుగైన వేతన రేటు లభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఫామ్ పాండ్లను సద్వినియోగం చేసుకుని వ్యవసాయంతో పాటు అనుబంధ జీవనోపాధి కార్యకలాపాలను చేపట్టాలని సూచించారు.అనంతరం దమ్మూరు గ్రామంలో నిర్వహించిన వీవో సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. వెదురు సాగు ద్వారా కలిగే ఆర్థిక ప్రయోజనాలను వివరించారు. వెదురుకు మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపడితే దీర్ఘకాలికంగా మంచి ఆదాయం పొందవచ్చని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు సమూహాలుగా ముందుకు వచ్చి వెదురు సాగుతో పాటు ఇతర జీవనోపాధి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. అదేవిధంగా ఇంటిగ్రేటెడ్ ఫామ్ పాండ్ల ఏర్పాటు, వాటి వినియోగం, వ్యవసాయానికి మరియు అనుబంధ జీవనోపాధికి కలిగే ప్రయోజనాలపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. అనంతరం బూరుగూడెం అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించి వారి విద్యా ప్రగతి, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సామ్ కేటగిరీకి చెందిన చిన్నారి బరువును పరిశీలించి, పిల్లల పోషణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. తదుపరి ఆశ్రమ పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్ పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల భౌతిక హాజరు, వంటశాల నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా పాఠశాలలో అన్ని అంశాలను మెరుగుపరచాలని సిబ్బందికి సూచించారు. ఈ పర్యటనలో ఎంపీడీవో సాయి పవన్, ఏపీవో రాజయ్య, ఏపీఎం రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

# కాళోజీ.. మానవత్వానికి మరో మజిలీ



అన్యాయాలను అధ్యయనం చేసీ
ఊపిరినే ఉద్యమంగా శ్వాసించీ
ప్రజల గొడవనే ఇంకుగా మార్చి
ప్రాంతం ఆర్తినే అక్షరాలుగా కూర్చి
భాష యాసలనే నిత్యం
పారాయణంగా రాసిన ఓ ప్రజాకవీ...
నీవు నడిచిన ఈ నేలంతా
నీ పాదముద్రలే!అడుగడుగునా
అస్తిత్వంకోసం కలమెత్తివడివిడిగా
అన్యాయంపైన గలమెత్తి
పరభాషా పెత్తనాన్ని చిత్తు చేసి
ప్రజా సంస్కృతిని చాటిచెప్పి
బతుకమ్మను మాకు అప్పజెప్పి
మనది వేరు తెలంగాణ అంటూ
ప్రజలను నిరతం చైతన్య పరచిన
ఓ క్రాంతదర్శి...ప్రత్యేక ఉద్యమ
మాటల్లో కనిపిస్తున్నవన్నీ...
నీ అక్షరాల ముద్రలే!
వేషం కంటే భాష ముఖ్యమంటూ
మాండలికం భాషకు మాటలు నేర్పావు
పరభాష తత్వాన్ని చేతి కర్రతో విదిలిస్తూ
ప్రతి గుండెల్లో ప్రాంత పతాకాన్నెగరేసావు
జనజీవన గీతాన్ని చరణాలుగా ఆచరిస్తూ
బడుగుల బతుకులను దీపమై వెలిగించావు
మనిషి కోసమే నా తపనంటూ
ముందుకు సాగిన ఓ వైతాళికుడా...
నీవు నేర్పిన పలుకుబడుల భాష
సమాజ హితమైంది. ఆ అక్షరాలన్నీ మాకు
వ్యవహారమయ్యింది.
సందులు, సమాసాలు, వ్యాకరణాలు
అన్నీ నియమాలు వదిలి.
పుస్తకాల పుటల్లో పురుడోసుకుంది
నీ పదాలకు నిఘంటువుల్లో
నిలువెత్తు అర్థం దొరికింది
అందుకే...
***సెప్టెంబరు 9 వ తేదీ***
***మాకు మాతృభాష అయ్యింది!***
***నేటి సినిమాలకు అదే ప్రగతి పథం***
***అయ్యింది.!తెలంగాణ కవికులానికి***
***ఆదర్శమార్గమైయ్యింది..!***

**– సోమశిల తిరుపాల్,**
**9989260336**

Printed, Published and Ownedby **JADAV ROHIDAS**, and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293.**Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197,9490111460